బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డా.. బస్‌స్టేషన్



- ఆర్టీసీ ఉద్యోగులపై నిరంతర దాడులు
- భయాందోళనలో ఉద్యోగులు, సిబ్బంది
- నిద్రావస్థలో పోలీసులు



పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆసియా ఖండంలోనే అతి పెద్ద బస్‌స్టేషన్లలో ఒకటిగా గుర్తింపు పొందిన పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నేడు బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డాగా మారింది. గతంలో రైల్వే స్టేషన్, వన్‌టౌన్ ప్రాంతాల్లో చెలరేగిన బ్లేడ్ బ్యాచ్ ఇప్పుడు బస్‌స్టేషన్‌ను అడ్డాగా మార్చుకుని హల్‌చల్ సృష్టిస్తున్నాయి.

వరుస దాడులతో కలకలం

గతంలో రైల్వే స్టేషన్‌ను అడ్డాగా చేసుకుని తమ కార్యకలాపాలు సాగించిన బ్లేడ్ బ్యాచ్ అక్కడ రైల్వే పోలీసులు వారిపై గట్టి చర్యలు తీసుకోవటంతో తమ కార్యకలపాలకు బస్‌స్టేషన్‌ను అడ్డాగా మార్చుకున్నారు. పోలీసుల నిఘా తక్కువగా ఉండటంతో తమ పనులకు అడ్డే లేకుండా చెలరేగుతున్నారు. చీకటి పడితే మద్యం, గంజాయి సేవించడంతో పాటు నిద్రకు ఇక్కడే ఉపక్రమిస్తున్నారు. మద్యం, గంజాయి మత్తులో ప్రయాణికులపై దాడులు చేయటం, వారి వద్ద నుంచి బలవంతంగా డబ్బులు, విలువైన వస్తువులను దొంగిలించటం లక్ష్యంగా మార్చుకున్నారు. అడ్డుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులపై నిరంతరం దాడులకు సైతం పాల్పడుతున్నారు. వరుస దాడులు కలకలం రేపుతున్నాయి.

భయాందోళనలో ఆర్టీసీ ఉద్యోగులు...

బ్లేడ్ బ్యాచ్ సభ్యులు మత్తులో తమలో తాము గొడవలు పడటమే కాకుండా ఆర్టీసీ ఉద్యోగులపై కూడా దాడులకు తెగబడుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. గతంలో టికెట్ బుకింగ్ కౌంటర్‌లోని ఉద్యోగులపై దాడిచేసిన బ్లేడ్ బ్యాచ్ ఈ నెల 11న మరోసారి బస్‌స్టాండ్‌లో డ్యూటీలో ఉన్న కంట్రోలర్‌పై దాడి చేసి గాయపర్చటంతో తమకు భద్రత లేకుండా పోయిందని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు. బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులపై బ్లేడ్ బ్యాచ్ సభ్యులు దాడులు చేసి గాయపరుస్తున్న పోలీసులు పట్టించుకోక పోవటంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

కొరవడిన నిఘా..

నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలతో ఎప్పుడు రద్దీగా ఉండే పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో పోలీసుల నిఘా ఉండడం లేదు. దీంతో బ్లేడ్ బ్యాచ్, జేబు దొంగల హావా ఎక్కువైందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రజలు ఆనందంగా జీవించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అభయాంజనేయుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. బుడమేరు వంతెన సెంటర్‌లో మంగళవారం శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేశారు.

రామలింగేశ్వరుడికి విశేష పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం శర్మ స్వామివారిని పండ్లరసాలతో అభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో అర్చనలు చేసి స్వామివారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నగరంలో ఆక్రమణల తొలగింపు



పటమట(విజయవాడతూర్పు): రోడ్డుపై ట్రాఫిక్‌కు అవరోధంగా ఉండే ఆక్రమణల తొలగింపుపై వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. సర్కిల్–1, 3 ఏరియాల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో అధికారులు తొలగిస్తున్నారు. సర్కిల్–1 ఏరియాలోని కేదారేశ్వరపేటలో ఉన్న మ్యాంగో మార్కెట్‌వద్ద ట్రాఫిక్‌కు అవరోధం కలుగుతోందని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విజయవాడ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు– వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళవారం ఆక్రమణలను తొలగించారు. సుమారు కిలోమీటరు వరకు ఆక్రమణలను తొలగించినట్లు వీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ గిరి తెలిపారు.

30వ డివిజన్‌లో దోమల నివారణ చర్యలు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు వీఎంసీ మలేరియా విభాగం అధికారులు స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్ రామకృష్ణాపురం, దేవీనగర్, విజయదుర్గానగర్, దావుబుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ, రైల్వే స్థలాలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో మురుగు, వర్షం నీరు నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారింది. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ 'సాక్షి' సోమవారం 'బాబోయ్ దోమలు' శీర్షికతో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన వీఎంసీ బయాలజిస్టు సూర్యనాయక్, మలేరియా ఇన్‌స్పెక్టర్ అనిల్, సూపర్‌వైజర్ బెనర్జీ పర్యవేక్షణలో మలేరియా నివారణ చర్యలు చేపట్టారు. మురుగునీటి స్థలాల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయడంతో పాటు ఫాగింగ్ చేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): హనుమాన్‌పేటలో ఉన్న చిట్టూరి విశ్వేశ్వరయ్య పార్కు వద్ద ఉన్న 800 ఎంఎం డయా నీటి సరఫరా ప్రధాన పంపింగ్ మెయిన్‌లైన్ మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో సర్కిల్–2 పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఈ నెల 29న తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని నుంచి తాగునీటి సరఫరా జరిగే అరండల్‌పేట, సీతారాంపురం, దుర్గా అగ్రహారం, ఏలూరు రోడ్డు, సూర్యారావుపేట, గవర్నర్‌పేట, గాంధీనగర్, దుర్గాపురం, భానునగర్, మధురానగర్, పసుపుతోట, కేదారేశ్వరపేట, పెజ్జోనిపేట ప్రాంతాల్లో 29వ తేదీ ఉదయం తెల్లవారుజామున 4.30 గంటలకు మాత్రమే నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అనంతరం 30వ తేదీ సాయంత్రం వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. స్థానికులు ముందుగానే నీటిని నిల్వచేసుకుని వీఎంసీ సిబ్బందికి సహకరించాలని ఆయన సూచించారు.

న్యాయవ్యవస్థలో సంస్కరణలు రావాలి

ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్



తప్పుడు కేసులు ఎదుర్కోవడం ఎలా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): న్యాయవ్యవస్థలో నూతన సంస్కరణలు రావాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా 'తప్పుడు కేసులు ఎదుర్కోవడం ఎలా పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సుంకర రాజేంద్రప్రసాద్ న్యాయ వ్యవస్థలో సంస్కరణల ఆవశ్యకతను వివరించారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం చేసిన కొన్ని చట్టాలు, పౌరుల హక్కులకు భంగం వాటిల్లే విధంగా ఉన్నాయన్నారు. కోర్టులకు సైతం అధికారాలు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తక రచయిత తిప్పనేని రామదాసప్పనాయుడును మాజీ మంత్రి వసంత నాగేశ్వరావు, సుంకర రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. అనంతరం మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావుకు అత్యుత్తమ సామాజిక న్యాయ సేవా రత్నా అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగకు ఐదు నెలల జైలు

విజయవాడస్పోర్ట్స్: ద్విచక్ర వాహనాల చోరుడికి ఐదు నెలల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ విజయవాడ మూడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నామాల జ్యోతి మంగళవారం తీర్పు చెప్పారు. కేదారేశ్వరపేట ఫ్రూట్ మార్కెట్, గాంధీనగర్ రిజిస్ట్రార్ కార్యాలయం, కపర్థి థియేటర్ వద్ద 2023 డిసెంబర్, 2024 జనవరి, మార్చి నెలల్లో మూడు బైకుల చోరీపై సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా దొంగతనం కేసులో తోట్ల వల్లూరు పోలీస్ స్టేషన్లో అరెస్ట్ అయిన యనమలకుదురు గ్రామానికి చెందిన ఒడుగు సుబ్బారావును పి.టి.వారెంట్ పై తీసుకు వచ్చి కోర్టులో హాజరు పరిచారు. ఐదుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తిపై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సమానత్వమే రాజ్యాంగ లక్ష్యం

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అవినాష్, భాగ్యలక్ష్మి, మల్లాది, ఆసిఫ్ తదితరులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విష్ణు, శ్రీశైలజ, తదితరులు



బీబీఏ హాల్‌లో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలన్నింటిలోనూ సమానత్వమే భారత రాజ్యాంగ లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ చెప్పారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నగర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, ఆసిఫ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశాన్ని ఒకే తాటిపై నడిపిస్తున్నది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమేనని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు షేక్ ఆసిఫ్, డిప్యూటీ మేయర్ అవుతు శైలజ, ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాస్, లేళ్లపూడి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

- గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ గెజిటీర్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.అరుణ, అడ్వకేట్ కేజేఎస్ ప్రకాశరావు, ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆవుల వెంకట్రావు, జాతీయ రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ రమేష్, కృష్ణ, అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం తదితరులు పాల్గొన్నారు. సీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, క్రైం డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
- భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఎ) హాల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీబీఎ ప్రధాన కార్యదర్శి అరిగల శివరామ ప్రసాద రాజా, ఎంఎస్‌జే సత్యానంద్, గవర్నింగ్ బాడీ సభ్యులు క్రాంతికుమార్, మహిళా సెక్రటరీ రాజ్యలక్ష్మి, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగం ప్రతిఒక్కరికీ మార్గదర్శకమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో జరిగిన వేడుకల్లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కుక్కల అనిత, నేతలు అలంపూర్ విజయ్, యరగొర్ల శ్రీరాములు, కాళ్ల ఆదినారాయణ, కంభం కొండలరావు, మేడా రమేష్, అక్బర్ పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగం పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం ప్రసాదించిందని శారద కళాశాల సెక్రటరీ కుందా రామనారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని శారద జూనియర్ కళాశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం చేశారు. రాజ్యాంగ దినోత్సవంపై సదస్సు నిర్వహించారు. పౌరశాస్త్ర అధ్యాపకులు ప్రమోద్ కుమార్, డిగ్రీ ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని 'సెంట్రల్'లో వాడవాడలా మంగళవారం ఘనంగా నిర్వహించారు. బావాజీపేట సాంబమూర్తి రోడ్డులో బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, బీఆర్ అంబేడ్కర్ యువజన చైతన్య సంఘం ఆధ్వర్యాన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, కార్యదర్శి కొండాయగుంట రాము, యువజన చైతన్య సంఘం నేతలు పోతుల విల్సన్ రాజు తదితరులు పాల్గొన్నారు. దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యాన మాక్సివిజన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. అనంతరం జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ, ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కాలేజీలో..

రాజ్యాంగాన్ని యువత విధిగా, బాధ్యతగా వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో వి. శ్రీనివాసరావు అన్నారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము, పౌర శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం సందేశం ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ పర్యవేక్షణలో ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి బీఎస్ఎన్ఎల్ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం చిత్తరంజన్ గ్రంథాలయలో గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

పటమట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగాన్ని గురించి పౌరులందరూ తెలుసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: రాజ్యాంగ దినోత్సవం హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. ఏపీ మండల విద్యాశాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మామిడి శ్రీనివాస్, చందర్లపాడు ఈఓపీఆర్‌డీ పిల్లి ఏసుబాబు, హెచ్ఎం పరసా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- స్థానిక 62వ డివిజన్ లాల్‌బహదూర్‌శాస్త్రి(ఎల్‌బీఎస్)నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీఎంసీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఏసీ డాక్టర్ చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది



ఏలూరు రోడ్డులో రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ

స్థలాలివ్వండి.. కట్టుకోవడానికి డబ్బులు ఇవ్వండి

సీపీఐ నేతలు



సీపీఐ కార్యాలయం వద్ద దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు.. ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు డిమాండ్ చేశారు. సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లోని హోచిమిన్ భవనం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాల కోసం అప్లికేషన్లు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నగరంలో రెండు సెంట్ల స్థలం ఇచ్చి దానిలో ఇల్లు కట్టుకోవడానికి 4 లక్షలు ఇస్తానని వాగ్దానం చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఆ హామీలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇసుక, కంకర, సిమెంట్ వంటి ధరలు పెరిగిపోయిన కారణంగా ఇంటి నిర్మాణాల కోసం లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క 58 డివిజన్లో 980 అప్లికేషన్లు రాశామని, ఇలా నగర వ్యాప్తంగా ఇంకా ఎంతమంది ఇల్లు లేనివారు ఉన్నారో ప్రభుత్వమే గుర్తించాలన్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకొని, ఇల్లు లేని వారికి ఇంటి స్థలాలలను కేటాయించాలని లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నేతలు సీహెచ్ గురవయ్య, టి.బ్రహ్మాజీ, పి.నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయం

సీపీఎం



కరెంట్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వస్తే విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. హామీలను ఉల్లంఘించి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమని సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం 58, 59 డివిజన్ల కమిటీల ఆధ్వర్యంలో సింగ్‌నగర్ కరెంట్ ఆఫీస్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించి ముందస్తుగా వ్యాపార సంస్థలకు ప్రారంభించి మీటర్లలోని మతలబు చెప్పకుండా బలవంతపు బిగింపు కార్యక్రమం మొదలు పెట్టారని విమర్శించారు. షాపుల తర్వాత ప్రతి ఇంటికి మీటర్లు పెట్టే విధానం అమలు చేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాలను రద్దుచేసి ప్రజా అనుకూల నిర్ణయాలు చేయాల్సింది పోయి.. అవినీతికర ఒప్పందాన్ని కొనసాగించడం ఎంత వరకూ న్యాయమని ప్రశ్నించారు. అవినీతిని అరికడతామని నమ్మ పలుకుతూ అవినీతి ఒప్పందాలను కొనసాగించడం ప్రజలపై భారాలు వేయటం దౌర్భాగ్యమని మండిపడ్డారు. ప్రజల మేలు కంటే మోదీ ప్రభుత్వానికి అదాని తదితర బడా కంపెనీ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్నట్లు ఉందన్నారు. ఒక్కొక్క స్మార్ట్ మీటర్ 13 నుంచి 30 వేల రూపాయలు వరకు వినియోగదారుల నుంచి వాయిదా పద్ధతిలో వసూలు చేయడానికి సిద్ధపడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకముందే 17వేల కోట్ల చార్జీల భారాన్ని ప్రజలు నెత్తిన రుద్దుతున్నారు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి.. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లు వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సీపీఎం నాయకులు సీహెచ్ శ్రీనివాస్, ఎస్‌కె పీర్ సాహెబ్, నిజాముద్దీన్, సాంబశివరావు,నాగార్జున, పీఎస్ఎన్ మూర్తి, ఎంవి రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్తిక కాంతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం సాయంత్రం మారుతీ వ్యాయామశాల సమీపంలోని శ్రీ లక్ష్మీగణపతి మందిరంలో దీపోత్సవం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సద్గురువుల సేవలో తరించాలి



డాక్టర్ వాగీష్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సద్గురువుల సేవలో తరించాలని సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ అన్నారు. శ్రీ సద్గురు సంగీత సభ 31వ వార్షికోత్సవం సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ సంగీతోత్సవాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం సంగీత విద్వాంసుడు డాక్టర్ కె.వాగీష్‌కు 2024 సంవత్సరానికి శ్రీసద్గురు సంగీత సభ విద్వన్మణి, సంస్కృత పండితులు, హరికథకుడు డాక్టర్ ముప్పవరపు సింహాచల శాస్త్రికి హరికథా చతురానన బిరుదు, డాక్టర్ వాగీష్ గాత్ర కచేరి కార్యక్రమం నిర్వహించారు. బీవీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి పోత్సహించడంలో శ్రీ సద్గురు సంగీత సభ ముందుంటుందన్నారు. గౌరీనాథ్ మాట్లాడుతూ విద్వాంసులను గౌరవించుకోవాలన్నారు. గాయత్రీ గౌరీనాథ్ , జేఎస్ఎస్ ప్రసాద్ శర్మ, వీఆర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యవ్రతాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం సాయంత్రం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆలయకమిటీ ఆధ్వర్యాన సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. కార్తిక మాసం చివరి సామూహిక సత్యనారాయణ వ్రతాలు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

వరద బాధితుల సహాయార్థం ఏపీటీడీసీ విరాళం



సాక్షి, అమరావతి: వరద బాధితుల సహాయార్థం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉద్యోగులు ఒక రోజు జీతాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని డాక్టర్ చందన చెప్పారు. స్థానిక వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ధీర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. చందన మాట్లాడుతూ.. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయమని, వారి పట్ల వివక్ష చూపకూడదన్నారు.

కల్యాణిదేవిగా భ్రమరాంబ దర్శనం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు మంగళవారం శ్రీ కళ్యాణి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్షదీక్షా మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఏకాదశి పురస్కరించుకొని ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేశారు.